క్లుప్తంగా

బాధిత కుటుంబానికి అండగా నిలబడుతాం



బాధిత కుటుంబ సభ్యులతో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు సాయి సతీమణి రాజేశ్వరి శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయుడు ఆకర్ష్ రెడ్డి అక్కడికి చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. సాయి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆకాశదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. కార్యక్రమంలో ఈఓ సతీమణి సుధ, ఆలయ అధికారులు, వేద పండితులు పాల్గొన్నారు.

కామాక్షయ్య సేవలు అభినందనీయం



కామాక్షయ్యకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు

నాగలాపురం : మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా యూటీఎఫ్ కార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు, శేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కామాక్షయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కామాక్షయ్య సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం అందరికీ చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, రవి, మునిరత్నం, వెంకటేష్, తంగరాజ్, భూషణం పాల్గొన్నారు.

మహిళలు మమోగ్రామ్ పరీక్షలు తప్పనిసరి



సీఎల్‌ఎన్‌పల్లిలో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది


వరదయ్యపాళెం : ప్రాథమిక దశలో రొమ్ము కేన్సర్‌ను గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన మహిళలు మమోగ్రామ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వరదయ్యపాళెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. పింక్ బస్ ద్వారా స్విమ్స్‌కు చెందిన శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సీఎల్‌ఎన్‌పల్లి, ఇందిరానగర్ గ్రామాల్లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేసుకోవడం ద్వారా కేన్సర్‌ను నిర్ధారించడానికి వీలవుతుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ద్వైత, హరిత, చైతన్యభాను, స్థానిక సర్పంచులు దుద్దు వేణు, వీరభద్రయ్య, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, వైద్య సిబ్బంది తులసమ్మ, మధుసూదన్, జయలక్ష్మి, రోజా, నిర్మల పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధి గాంచిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు కార్తికేశన్ గురుక్కల్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయంలోని నందీశ్వర స్వామి, వాల్మీకీశ్వర స్వామికి ఏక కాలంలో పూజలు చేశారు. వాసుదేవనాయుడు కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.లత, పాలక మండలి సభ్యులు ఆనందయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నాలుగు రూపాయలు మిగలాలంటే అదునులో వర్షాలు కురవాలి.. పదునులో విత్తనం పడాలి.. చీడపీడలు వ్యాపించకుండా సస్యరక్షణ జరగాలి.. దిగుబడులు బాగుండి.. గిట్టుబాటు ధర దక్కితేనే పెట్టుబడులు పోను లాభాలు వచ్చేది. అయితే రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అవసరం లేకున్నా నకిలీ మందులు అంటగట్టి అన్నదాతను నిలువునా దోపిడీ చేస్తున్నారు.

– శ్రీకాళహస్తి



నకిలీ మందులతో దగా

- అనుమతి లేని మందుల విక్రయాలు
- రైతులకు నగం ధరకే డోర్ డెలివరీ
- మోసపోయి లబోదిబోమంటున్న రైతులు

తిరుపతి జిల్లా నుంచి ముఖ్యమైన శ్రీకాళహస్తి , సత్యవేడు, నాయుడుపేట, సూళ్ళూరుపేట కేంద్రాలుగా రైతులను దగా చేసే కేటుగాళ్లు తయారయ్యారు. రబీ సీజన్ ప్రారంభమైన వెంటనే వరి ఎక్కువగా పండే ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసుకుని రైతుల వద్దకు వెళ్లి ప్రముఖ కంపెనీల పేర్లు చెప్పి నకిలీ మందులను అంటగట్టి డబ్బులు దోచేస్తున్నారు.

డోర్ డెలివరీ చేస్తూ..

రైతుల వద్ద నుంచి ముందస్తుగా అడ్వాన్సు రూపంలో నగదు తీసుకొని బ్రాండ్ కంపెనీల పేర్లు చెప్పి వాటిని ఇంటికే డోర్ డెలివరీ చేసి అనంతరం పత్తా లేకుండా పోతున్నారు. నకిలీ మందులు పనిచేయక రైతులు డబ్బులు పోగొట్టుకుని ఎవరికి చెప్పుకోలేక తమలో తామే కుమిలిపోతున్నారు. ఆ తరహాలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో కొందరు కేటుగాళ్లు రైతులను నిలువునా మోసం చేస్తున్నారు.

కంపెనీ మందులకు దీటుగా

కంపెనీ పురుగు మందులకు దీటుగా నకిలీ మందులను తయారు చేసున్నారు. ఆన్‌లైన్‌లో అసలైన వాటిని కాపీ కొట్టి ఆ పేర్లతో డబ్బాలను తయారు చేసి ఆన్‌లైన్‌లో కూడా పెట్టి విక్రయాలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారు. వారిచ్చే బిల్లుల్లో ఉండే ఫోన్ నంబర్లు, డబ్బులు తీసుకున్న వెంటనే పని చేయకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

“ రైతుల వద్దకు ఎవరైనా నేరుగా వచ్చి ఎరువులు, పురుగుమందులు అమ్ముతామని వస్తే వెంటనే వ్యవసాయ అధికారి, పోలీసులకు ఫిర్యాదు చేయాలి. రైతులకు తరచూ అవగాహన కల్పిస్తున్నా మోసపోతున్నారు. దీనిపై గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తాం. లైసెన్సు కలిగిన దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనాలని తెలియజేశాం.

- రమేష్‌రెడ్డి, ఏడీఏ

కార్యకర్తలకు అండగా నిలబడాలి



మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాకేష్

బుచ్చినాయుడుకండ్రిగ : తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనరు, తిరుపతి సోషల్ మీడియా కోకన్వీనరు వేలూరు రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని తెలిపారన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్తలకు అండగా నిలవాలని, కూటమి ప్రభుత్వం వలన నష్టపోయిన వారిని గుర్తించి, వారికి తోడ్పాటు అందించాలని సూచించారన్నారు.

సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జనార్దన్

సత్యవేడు : నియోజకవర్గ కేంద్రంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం సత్యవేడులోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రధాన ఉపన్యాసకులుగా మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమలి మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్, జిలా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందారపు మురళి హాజరవుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1న సత్యవేడు పట్టణంలో సాయిబాబా మందిరం సమీపం నుంచి వీఎంకే కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా శ్రీసిటీలోని పరిశ్రమలకు సంబంధించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావన ఉంటుందన్నారు. తొలిసారిగా సత్యవేడులో సీపీఎం జిల్లా మహాసభలు జరుగుతున్నాయన్నారు. అలాగే జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రమేష్, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి , యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై తక్కువ సమయంలోనే ప్రజావ్యతిరేకత మూటగట్టుకుందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం నేడు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక గత ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని విమర్శించారు. యువతకు ఉద్యోగాల కల్పన లేక ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టిన ఘనత చంద్రబాబుకే సొంతమైందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్న రూ. 3 వేలు అసలే లేదన్నారు. 2.60 లక్షల వాలంటీర్లు, ఎక్సైజ్‌శాఖలో పని చేస్తున్న మరో 15 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించి నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని విమర్శించారు. సంపద సృష్టించడమంటే 6 నెలలకు ఏకంగా రూ. 63 వేల కోట్లు అప్పులు చేయడమా ? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఒకేసారి 17 నూతన మెడికల్ కాలేజీల పనులను ఏకకాలంలో మొదలు పెడితే ఆ పనులను నిర్వీర్యం చేస్తూ ఏకంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు చేపట్టడం సిగ్గుచేటని రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభద్రతలో బాలికల గురుకులం

-కంచె ప్రహరీతో తల్లిదండ్రుల ఆందోళన



బాలికల గురుకులానికి రేకులతో నిర్మించిన కంచె

శ్రీకాళహస్తి : బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ గోడకు బదులు రేకులతో కంచె ఏర్పాటు చేయడంపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరులేన్ల రోడ్డు నిర్మాణంలో భాగంగా కాసా గార్డెన్ ప్రహరీ స్థలం కొంత భూసేకరణలో పోయింది. దానికి పరిహారం రూపంలో కొంత పైకాన్ని ఏపీ గిరిజన ప్రధాన కార్యాలయానికి చెల్లించారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో అందుకు సంబంధించిన గోడ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో మెగా కంపెనీ వారు రేకులతో తాత్కాలికంగా కంచెను ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల రేకులు పోయి లోపల, బయటకు వెళ్లేందుకు అనుకూలంగా మారింది. ఈ బాలికల గురుకులంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 600 మంది గిరిజన విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఎవరైనా అర్ధరాత్రి లోపలికి ప్రవేశిస్తే పరిస్థితి ఏంటని బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి వచ్చిన వెంటనే పనులు

ప్రహరీ ఏర్పాటు విషయంపై ప్రధాన కార్యాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లా. వారు జిల్లా అధికారులకు అంచనా నివేదిక పంపాలని కోరగా పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రహరీ నిర్మాణం పూర్తి చేస్తాం.

- ప్రభావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్

ఘనంగా అభిషేక పూజలు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగలో కార్తీక మాస త్రయోదశిని పురస్కరించుకుని చండికా పరమేశ్వరి సమేత శ్రీచక్రేశ్వరస్వామి ఆలయంలో శ్రీచండికాంబిక వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశం శాస్త్రి ఆధ్వర్యంలో చక్రేశ్వరస్వామికి శతరుద్రీయ అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం హోమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వేదపండితులు సింగరాజు మణి, సునీల్, చంద్రశేఖర్‌శాస్త్రి, అశోక్ పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు



రేణిగుంటపై ఓవర్ వంతెన కింద చెత్తకు పెట్టిన నిప్పు

రేణిగుంట : రేణిగుంట ఫ్లై ఓవర్ వంతెన కింద పడేసిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన పంచాయతీ సిబ్బంది అక్కడే నిప్పు పెట్టి కాల్చుతున్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ కాల్చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయని అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట ఫ్లై ఓవర్ వంతెన కింద భాగాన్ని చుట్టు పక్కల వారు చెత్తా చెదారం వేస్తూ డంప్‌యార్డ్‌గా వినియోగిస్తున్నారు. బిస్మిల్లా నగర్, భగత్ సింగ్ కాలనీవాసులు ఫ్లైఓవర్ పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డులో రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కిందనే చెత్తా చెదారం వేయడంతో దుర్వాసన వెదజల్లుతూ అటు వైపు వెళ్లేవారు ముక్కు మూసుకొని ప్రయాణిస్తున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చెత్తను అక్కడే కాల్చివేయడంతో గురువారం ఉదయం దట్టమైన పొగ అలుముకుంది. పక్కనే ఉన్న పాఠశాల ప్రాంగణాన్ని పొగ ఆవహించటంతో విద్యార్థులు ఊపిరాడక సతమతమయ్యారు.

గతంలో ఇక్కడ అనేక పర్యాయాలు చెత్తను పంచాయతీ సిబ్బంది కాల్చి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ వంతెన కింద చెత్త వేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

జనరేటర్‌కు మరమ్మతులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో అధికారులు జనరేటర్‌కు మరమ్మతులు చేపట్టారు. సాక్షి దినపత్రికలో జనరేటర్ మరమ్మతులపై కథనం రావడంతో అధికారులు స్పందించారు. దీంతో గురువారం జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో రోగులు, వారి బంధువులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

గంగజాతర పేరుతో వసూళ్లకు పాల్పడితే చర్యలు

శ్రీకాళహస్తి : గంగజాతర డిసెంబరు నెలలో జరిగే సందర్భంగా కమిటీలు జాతర పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నరసింహమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంగజాతర సందర్భంగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కమిటీల్లో ఎవరైనా బలవంతం చేయకుండా ఇచ్చింది తీసుకుంటే ఏ అభ్యంతరం లేదని... అలా కాకుండా బలవంతంగా వసూళ్లు చేస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవన్నారు. ఎవరూ గంగజాతర పేరుతో వసూళ్లకు పాల్పడవద్దని డీఎస్పీ హితవు పలికారు.

జాతీయ స్థాయి క్రీడలకు స్థానిక విద్యార్థి



వసు తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణవనం: మండలంలోని అరణ్యంకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థిని వసు జాతీయస్థాయి వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి, పీడీ వెంకటేశులు మాట్లాడుతూ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి వసు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టులో స్థానం పొందిందన్నారు. ఇటీవల విజయనగరం జిల్లా భోగాపురం ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని, రాష్ట్ర జట్టులో స్థానాన్ని పొందిందని తెలిపారు. డిసెంబర్ 12వ తేదీ నుంచి వారణాసిలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్రం తరపున వాలీబాల్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినికి ఖర్చుల నిమిత్తం పాఠశాల ఉపాధ్యాయులు రూ.10 వేలు, పీడీ వెంకటేశ్వర్లు వ్యక్తిగతంగా రూ.8 వేలు అందజేశారు.

వేంకటేశ్వరస్వామికి పూలంగిసేవ



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం వికృతమాలలో వెలసిన శ్రీ సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పూలంగిసేవ అలంకరణ శోభాయమానంగా జరిగింది. మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు, ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు కృష్ణమాచార్యులు, రత్నాకరం, రామాచార్యులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శం



సత్యవేడు : పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వార్డెన్ రామయ్య

సత్యవేడు : మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. అంటరానితనం అసమానతలు లేకుండా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. సురేష్, టి. హరి, పిఈటీ నాగరాజు, పీఎంసీ చైర్మన్ పి.సురేష, టి.సురేష్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని వార్డెన్ రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు మహాత్మా జ్యోతిరావు పూలే పై వ్యాస రచన పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజన మహోత్సవం



భోజనం వడ్డిస్తున్న ఈఓ బాపిరెడ్డి



భోజనం చేస్తున్న ఆలయ ఉద్యోగులు,, ప్రజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది.ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరద్వాజతీర్థం వద్ద గల గంగాసదన్‌లో వనభోజన మహోత్సవాన్ని ఈఓ బాపిరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఆలయ ఆధ్వర్యంలో వన భోజన మహోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు



గర్భిణులకు సూచనలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు

సత్యవేడు : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరుగుతాయని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని ఆంబాకం ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణుల పరీక్షలపై ఆరా తీశారు. మదనంజేరిలో నిర్వహించిన ఎఫ్‌డీపీ ప్రోగ్రాంను పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు మూడో నెలలోనే ఆశా, ఏఎన్‌ఎంల వద్ద పేరు , ఊరు, అడ్రస్ వైద్య పరీక్షల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. అప్పటి నుంచి వారు అందుబాటులో ఉంటూ అవసరమైన అన్ని ఇంజక్షన్లు చేస్తూ రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తారన్నారు. ముఖ్యంగా రక్తహీనతతో ఇబ్బందులు పడే వారి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారని, బ్లడ్ గ్రూపునకు తగిన రక్త నిల్వలు అందుబాటులో ఉంచుతారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గుణశేఖర్, ఎస్‌ఓ నాగేంద్ర కుమార్, సూపర్ వైజర్ నరేష్‌బాబు, పీపీఓ ప్రకాష్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు , గర్భిణులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని వీయస్‌పురంలో గతనెల 19వ తేదీన పల్లె పండుగలో భాగంగా సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించి, వేయడం మరిచారని వైఎస్సార్‌సీపీ మండల యువజన నేత కిరణ్‌యాదవ్ తెలిపారు. గ్రామంలోని వీధుల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వర్షం పడితే బురదమయంగా మారుతున్నాయని ఆరోపించారు. రోడ్డు పనులను ప్రారంభించి 40 రోజులు కావస్తున్నా అధికారులు, అధికార పార్టీ నేతలు పట్టించుకోలేదన్నారు. ప్రారంభానికి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హాజరైనా పనులు మాత్రం ఇంత వరకూ చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డు పనులను చేపట్టి, త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.